సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

బుధవారం । 5 । జూలై । 2023



కడపకు అగ్రస్థానం
ఏసీఏ అంతర్ జిల్లాల అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌లో కడప జట్టు అగ్రస్థానంలో నిలిచింది. పాయింట్ల పట్టికలో 12 పాయింట్లతో కడప అగ్రస్థానంలో నిలిచింది. - 8లో



నిధుల స్వాహా
వల్లూరు వైఎస్ఆర్ క్రాంతి పథంలో నిధుల దుర్వినియోగం జరిగింది. సుమారు 53.79 లక్షల రూపాయల మేర నిధులు స్వాహా చేసినట్లు అధికారులు గుర్తించారు. - 8లో



విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ
బీరం శ్రీధర్‌రెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్‌లో మామిడిశెట్టి సోహిత్ (11)మృతి ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు. ఎస్పీ అన్బురాజన్ వివరాలను వెల్లడించారు. - 8లో

న్యూస్‌రీల్

ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ



కడపలోని ప్రైవేట్ ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు మంగళవారం కడప నగరంలోని చెన్నై చిల్డ్రన్స్ ఆసుపత్రి, రెమిడి మల్టీ స్పెషాలిటీ, దీపేష్ తదితర ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమ్యూనికబుల్ డిసీజెస్ (అంటువ్యాధులు) మలేరియా, టైఫాయిడ్, కామెర్లు, చికెన్‌గున్యా తదితర వ్యాధులతో వచ్చే వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన రోగుల వివరాలను ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్‌ఫర్మేషన్ ప్లాట్ ఫామ్‌లో రిపోర్ట్‌ను పొందుపరచాలని పేర్కొన్నారు. ఎపిడమాలజిస్ట్ ఖాజామొహిద్దీన్, పాలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సాహస అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కడప స్పోర్ట్స్: భారత ప్రభుత్వ, యువజన సర్వీసుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో 'టెన్సింగ్ నార్కే జాతీయ సాహస అవార్డు'లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ తెలిపారు. 2020, 2021, 2022 సంవత్సరాల్లో భూమి, నీరు, గాలి వంటి వాటిపై చేసిన సాహస కార్యక్రమాల్లో అత్యుత్తమ విజయాలు సాధించినవారు అవార్డ్స్.జీఓవి.ఇన్ ద్వారా ఈ నెల 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అవార్డు గ్రహీతలకు టెన్సింగ్ నార్కే కాంస్య విగ్రహంతో పాటు ప్రశంసాపత్రం, రూ. 15 లక్షల నగదు ప్రోత్సాహం రాష్ట్రపతి చేతుల మీదుగా బహూకరిస్తారన్నారు.

నేడు రైతు బజార్‌కు టమాటాలు

కడప అగ్రికల్చర్: రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో సరఫరా చేసే టమాటాలు బుధవారం కడప రైతు బజార్‌కు రెండు టన్నులు రానున్నట్లు మేనేజర్ నాయక్ తెలిపారు. టమాటాలు కావలసిన వినియోగదారులు తమ వెంట ఆధార్ తీసుకుని రావాలని, ఒక్కొక్కరికి కిలో చొప్పున మాత్రమే ఇవ్వబడతాయన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

కడప అగ్రికల్చర్: ప్రభుత్వం మత్స్యకారులకు కోసం అమలు చేసే పథకాలను సకాలంలో అందచేసి వారి అభివృద్ధికి కృషి చేయాలని ఏపీ ఉద్యానశాఖ ప్రభుత్వ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి సూచించారు. మంగళవారం కడపలోని మత్స్యశాఖ కార్యాలయాన్ని సందర్శించి సంబంధిత శాఖలో అమలవుతున్న పథకాలపై సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి నాగలింగాచార్యులు, మత్స్య అభివృద్ధి అధికారి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు కోడూరు వాసి

రైల్వేకోడూరు అర్బన్ : దుబాయ్‌లో ఈనెల 30 నుంచి ఆగస్టు 5 వరకు జరిగే అంతర్జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు కోడూరు యువకుడు ఉమేష్ రిషి ఎంపికయ్యాడు. పట్టణంలోని కొత్తబజార్‌లో నివాసం ఉంటున్న శోడిశెట్టి శేషు కుమారుడు ఉమేష్ రిషిని మంగళవారం పలువురు క్రీడాభిమానులు అభినందించారు. ఈ సందర్భంగా తండ్రి శేషు మాట్లాడుతూ మే లో సంయుక్త భారతీయ ఖేల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఏపీ తరపున దుబాయ్‌లో జరిగే పోటీలకు ఎంపికయినట్లు వివరించారు.

యంత్ర సేవ.. రైతుకు చేరువ

'రైతు భరోసా' అన్నదాతకు ఆదరవుగా ఉంది. ఎప్పటికప్పుడు అందుతున్న 'బీమా'తో రైతన్నకు ఓ ధీమా దొరికింది. ఇక మీ కోసమే నేనంటూ 'యంత్ర సేవ' పథకం పుడమితల్లి బిడ్డకు మరింత చేరువైంది. వెరసి నేలతల్లి ఒడికి కొత్త జీవమొచ్చింది. 'రైతే రాజు' నినాదం నిజమై వర్ధిల్లుతోంది.

ఇప్పుడీ నినాదాన్ని.. క్షేత్రస్థాయిలోని నిజాన్ని 'పచ్చ' కళ్లు జీర్ణించుకోలేకపోతున్నాయి. వాస్తవాన్ని మరిచిన 'ఈనాడు' 'మాటల్లోనే యంత్రసేవ!' అంటూ ప్రజల మదిలో విష బీజాన్ని నాటాలని కుటిల యత్నం చేస్తోంది. వాస్తవాన్ని మరచి కళ్లకు గంతలు కట్టుకుని కుళ్లు రాతలు రాస్తూ అపహాస్యం అవుతోంది.

- ఆర్‌బీకే కేంద్రంలో సీహెచ్‌సీ సెంటర్ ఏర్పాటు
- ప్రాంతాల వారీగా పంటల సాగును బట్టి యంత్రాలు మంజూరు
- 2164 పరికరాలతో పాటు 295 ట్రాక్టర్లు అందజేత



పోరుమామిళ్ల మండలం రంగసముద్రం సీహెచ్‌సీకి మంజూరైన యంత్రాలతో రైతులు

సాక్షి ప్రతినిధి, కడప/కడప అగ్రికల్చర్: రైతు భరోసా కేంద్రాలు పంటల సాగుకు కావాల్సిన అన్ని రకాల సేవలను అందిస్తున్నాయి. విత్తనం నుంచి పంటల వరకూ దిగుబడి నుంచి కొనుగోలు వరకు తక్షణ సేవలందిస్తున్నాయి. ఇక పంటల సాగుకు కావాల్సిన వ్యవసాయ పనిముట్లను సైతం ప్రభుత్వం రైతులకు అందిస్తూ వ్యవసాయ సాగుకు మరింత తోడ్పాటునిస్తోంది. వాస్తవం ఇలా ఉంటే ఈనాడు వక్రీకరిస్తుంది.

ఇవిగో నిజాలు..
రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఆర్‌బీకే పరిధిలో 5 మంది సభ్యులతో కూడిన క్లస్టర్ హైరింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి రూ. 15లక్షల రూపాయల విలువ చేసే యంత్ర పరికరాలను అందించింది. ఇందులో భాగంగా 2021–22 సంవత్సరానికి సంబంధించి 347 సీహెచ్‌సీలకు అలాగే 2022–23కు 47 సీహెచ్‌సీలకు పరికరాలను అందించింది. ఇలా మొత్తంగా 432 ఆర్‌బీకే పరిధిలో 432 సీహెచ్‌సీలకు పరికరాలను అందించారు. ఇందులో 10 శాతం గ్రూపు వాటా కాగా 50 శాతం బ్యాంకులోను, మరో 40 శాతం సబ్సిడీ రాయితీ అందిస్తుంది. (ఒక్కో యూనిట్‌కు 6 లక్షల సబ్సిడీ) వాటిని ఆ క్లస్టర్ పరిధిలోని ఆర్‌బీకేలో ఉంచుతారు. ఇలా జిల్లాలో రూ.45.1 కోట్లు విలువ గల పరికరాలను అందుబాటులో ఉంచారు. వీటికి ప్రభుత్వం రూ.15.79 కోట్లు సబ్సిడీ ఇచ్చింది. రూ.4.13 కోట్లతో జిల్లాలో 20 వరికోత మిషన్లు సైతం అందించడం విశేషం. అవసరం ఉన్న ప్రతి రైతు బాడుగను చెల్లించి యంత్రాల సేవను వాడుకొవచ్చు. అంతేకాకుండా ఆయా ప్రాంతాలలో పంటల సాగును బట్టి ఏయే యంత్రాలు అవసరమో ఆ రకమైన మంత్రాలను మంజూరు చేసింది. ఆ పరికరాలను కూడా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి ఒక క్రమ పద్ధతిలో ఆ యంత్రాన్ని తీసుకెళ్లి వినియోగించుకునే అవకాశం కల్పించారు. వీటికి సంబంధించిన బాడుగను కూడా గ్రామంలోని అడ్వైజరీ బోర్డు వారు రేట్లను ఫిక్స్ చేసి ధరల వివరాల సూచికను ఏర్పాటు చేశారు.

ఏయే యంత్రాలను అందించారంటే...
ప్రతి ఆర్‌బీకే పరిధిలో ఆయా ప్రాంత వ్యవసాయ పంటల సాగును బట్టి ఏ యంత్రం అవసరం ఉందో ఆ మేరకు పరికరాలను అందించారు. ఇందులో ట్రాక్టర్, రోటోవేటర్స్, గోర్లు, గుంటకలు, పవర్ ట్రిల్లర్లు, ట్రాక్టర్స్ స్ప్రేయర్లు, డ్రైవాన్ స్ప్రేయర్లు, మినీ ట్రాకర్లతోపాటు పలు రకాల యంత్రాలను అందించారు. గ్రామం యూనిట్‌గా వ్యవసాయ పరికరాలను అందుబాటులోకి తెచ్చింది. 2,164 పరికరాలు, 295 ట్రాక్టర్లు అందుబాటులో ఉన్నాయి. అవసరమైన రైతులు ఆయా పరికరాలను అవసరానికి అనుగుణంగా వాడుకుంటుండడం విశేషం.

త్వరలో డ్రోన్లు కూడా...
త్వరలో జిల్లాకు డ్రోన్లను కూడా మంజూరు చేస్తున్నారు. మండలానికి 3 చొప్పున 105 డ్రోన్లు ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా మొదటగా 20 డ్రోన్‌లను ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి 23 మంది పైలెట్లను ఎంపిక చేశారు. వీరిలో ఇప్పటికి 12 మందికి శిక్షణ కూడా ఇవ్వగా మిగతా వారికి శిక్షణను ఇస్తున్నారు.

క్లస్టర్ స్థాయి కస్టమ్స్ హైరింగ్ సెంటర్స్

నియోజకవర్గం	మంజూరైన యూనిట్లు	యూనిట్ మొత్తం ధర లక్షల్లో	సబ్సిడీ రూ.లక్షల్లో
జమ్మలమడుగు	3	63.6	17.6
కడప	2	55.55	17.6
కమలాపురం	5	131.15	39.2
మైదుకూరు	6	153.6	52.8
పొద్దుటూరు	2	56.45	15.2
రాజంపేట	2	55.55	16.4

ఆర్‌బీకే స్థాయి కస్టమ్స్ హైరింగ్ సెంటర్స్

నియోజకవర్గం	ఆర్‌బీకే	సిహెచ్‌సీ	మొత్తం ధర రూ.లక్షల్లో	బ్యాంకులోను రూ.లక్షల్లో	సబ్సిడీ రూ.లక్షల్లో
బద్వేల్	74	74	632.73	381.42	170
జమ్మలమడుగు	83	76	743.12	373.52	270
కడప	2	2	27.81	13.91	8.49
కమలాపురం	75	76	778.82	405.59	266.14
మైదుకూరు	73	75	798.03	422.90	257.87
పొద్దుటూరు	28	28	381.60	190.80	116.40
పులివెందుల	78	81	906.72	450.62	319.65
రాజంపేట	19	20	241.45	119.35	87.91

పరికరాలను సద్వినియోగం చేసుకుంటున్నాం



ప్రభుత్వం సబ్సిడీతో అందించిన ట్రాక్టరు, విత్తనగొర్రు, మడకలను వాడుకుంటున్నా. నాతోపాటు గ్రామంలోని మిగతా రైతులు కూడా వాటిని సద్వినియోగం చేసుకుని పంటలను సాగుచేసుకుంటున్నారు. సంతోషంగా ఉంది. – వీర ప్రతాప్‌రెడ్డి, పాత సంగటిపల్లె, పెండిమర్రి మండలం.

సులభంగా మందుల పిచికారీ



ప్రభుత్వం సబ్సిడితో అందించిన పెట్రోల్ పంపుతో పంటలకు మందులను సులభంగా పిచికారీ చేసుకుంటున్నాం. బయట మార్కెట్‌లో దీన్ని కొనాలంటే చాలా రేటు ఉంది. కానీ ప్రభుత్వం సబ్సిడీతో అందించడంతో నాతోపాటు గ్రామంలో చాలా మంది దీనిని సద్వినియోగం చేసుకుంటున్నారు. – కేవరెడ్డి, కొత్త సంగటిపల్లె, పెండ్లిమర్రి.

ఆనందంగా ఉంది



ప్రభుత్వం సీహెచ్‌సీలు ఏర్పాటు చేసి యంత్రాలను ఇవ్వడం రైతులకు చాలా మేలైంది. వీటితో వ్యవసాయ పనులను సకాలంలో సులభంగా చేసుకుంటున్నాం. గ్రామంలో అవసరమైన వారంతా వీటిని వాడుకుంటు వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. చాలా ఆనందంగా ఉంది. – రామచంద్రారెడ్డి, పెద్దపలి, బాకరా పేట

సీహెచ్‌సీ వ్యవస్థతో ఎంతో మేలు



సీహెచ్‌సీ వ్యవస్థతో రైతులకు ఎంతో మేలు. గ్రామ పెద్దలు నిర్ణయించిన ధరలకు రైతులకు యంత్ర పరికరాలు అందుబాటులో ఉంటాయి. ఎవరికి ఏ పరికరం అవసరమైతే దానిని తీసుకెళ్లి వాడుకోవచ్చు. అలాకాకుండా అదే యంత్రం ఒకరి వద్దే ఉంటే వారు చెప్పిన రేటును చెల్లించాల్సి ఉంటుంది. దీంతో రైతులు నష్టపోవాల్సి ఉంటుంది. – అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయ అధికారి.

ప్రతి ఇంటా సంక్షేమం

- అదే ప్రభుత్వ లక్ష్యం
- కలెక్టర్ విజయ్ రామరాజు



లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న కలెక్టర్

కడప కార్పొరేషన్: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు, సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ విజయ్ రామరాజు అన్నారు. అర్హులైన ఏ ఒక్కరూ లబ్ధి పొందలేదనే పరిస్థితి రాకూడదన్నదే 'జగనన్న సురక్ష' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. మంగళవారం కడప నగరం 4వ డివిజన్ పరిధిలోని ఆర్‌కే నగర్ ఉర్దూ పాఠశాలలో ఏర్పాటు చేసిన 'జగనన్న సురక్ష' శిబిరానికి కలెక్టర్‌తోపాటు మేయర్ సురేష్ బాబు, కమిషనర్ ప్రవీణ్‌చంద్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ యానాదయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల ఇంటి వద్దకే వెళ్లి వారికి ఏం కావాలో తెలుసుకొని.. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు సంపూర్ణంగా అందించడమే లక్ష్యంగా నెల రోజుల పాటు జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత గురించి వివరించారు.

'జగనన్న సురక్ష'తో సమస్యల పరిష్కారం : మేయర్
జగనన్న సురక్ష కార్యక్రమంతో దీర్ఘకాలికంగా పరిష్కారం కాని ఎన్నో సమస్యలు పరిష్కారమవుతున్నాయని మేయర్ సురేష్ బాబు అన్నారు. ప్రజలు ఏ కార్యాలయాలకు వెళ్లనవసరం లేకుండా అధికారులే ఇళ్ల వద్దకు వచ్చి సమస్యలను పరిష్కరించడం దేశంలోనే ఎక్కడా లేదని తెలిపారు. ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి, తహసీల్దార్ శివరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, 4వ డివిజన్ ఇన్‌చార్జి ఆర్‌వీ రమణ, కార్పొరేటర్ ఎం. రామలక్ష్మణ్‌రెడ్డి పాల్గొన్నారు.

మత్తును చిత్తు చేద్దాం
కడప సెవెన్‌రోడ్స్ : మాదక ద్రవ్యాలైన గంజాయి, మత్తు పదార్థాల వినియోగం, విక్రయాలు, రవాణాను అరికట్టేందుకు జిల్లాలో పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ అధికారులతో ఆయన మాట్లాడారు. విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడకుండా విద్యాసంస్థల వద్ద అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. మత్తు పదార్థాల సరఫరాపై సమాచారం అందించేందుకు ప్రభుత్వం టోల్‌ఫ్రీ నెంబరు 15400ను విద్యా సంస్థలతోపాటు బహిరంగ ప్రదేశాల్లో ప్రదర్శించాలన్నారు. గంజాయి సాగు చేపట్టకుండా అటవీ అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, జేసీ గణేష్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పక్కాగా ఈ-క్రాప్ నమోదు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో ఖరీఫ్‌లో జరిగే ఈ-క్రాప్ నమోదులో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం ఇవ్వకుండా పక్కాగా చేయాలని కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రైమరీ సెక్టార్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయాధికారులు ప్రతి గ్రామాన్ని సందర్శించి రైతులకు తగు సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. గ్రామాల్లో నకిలీ విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బ్రహ్మంసాగర్, సీబీఆర్‌లలో నీరు విడుదల చేశామన్నారు. దీంతోపాటు పలు అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు.

కల్యాణ వైభోగమే..



కల్యాణ వేదికపై ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి,భూదేవి, సౌమ్యనాథుడు



కల్యాణోత్సవాన్ని తిలకించడానికి హాజరైన భక్తులు

నందలూరు(రాజంపేట) : నందలూరు సౌమ్యనాథాలయంలో మంగళవారం సౌమ్యనాథుని కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థాన ఆధ్వర్యంలో విలీనం తర్వాత తొలిసారిగా నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో కళ్యాణోత్సవమిది. టీటీడీ వేదపండితులు, అర్చకస్వాములు కళ్యాణోత్సవ క్రతువును క్రమంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకించడానికి వచ్చిన భక్తులతో ఆలయ ఆవరణం నిండుగా కళకళలాడింది. డీఎస్పీ చైతన్య ఆధ్వర్యంలో సబ్‌డివిజన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ముత్యాల తలంబ్రాలను సమర్పించిన ఎమ్మెల్యే మేడా
సౌమ్యనాథుని కల్యాణానికి రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి పట్టువస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. ఈయనకు ఆలయంలో అర్చకులు పూర్ణకుంభస్వాగతం పలికారు. ఈయన వెంట ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు మేడా మధుసూదనరెడ్డి, డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, జెడ్పీటీసీ గడికోటఉషా సుబ్బారెడ్డి, సినీనటుడు తోటవేణు, మాజీ చైర్మన్ సౌమిత్రి, నాగిరెడ్డిపల్లె సర్పంచి జంబు సూర్యనారాయణ పాల్గొన్నారు. అలాగే కడప ఆర్టీసీ రీజనల్ మాజీ చైర్మన్ యెద్దల సుబ్బరాయుడు, మాజీఎంపీపీ పల్లెమణ్యంతోపాటు పలువురు నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు



సీఎం పర్యటన ఏర్పాట్లపై మనోహర్‌రెడ్డితో చర్చిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

పులివెందుల రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మూడు రోజుల పర్యటనలో భాగంగా ఈనెల 9న పులివెందులలో పర్యటించే ప్రాంతాలను మంగళవారం కలెక్టర్ విజయరామరాజు పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లతో కలిసి పరిశీలించారు. ముందుగా ఆయన భాకరాపురం సమీపంలో ఉన్న హెలీప్యాడ్‌ను పరిశీలించి గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. అంబకపల్లె రోడ్డులోని గరండాల్ సిటీ ఫారెస్ట్, స్కిల్ డెవలప్‌మెంట్ కళాశాల భవనాలను, హాకీ స్టేడియం, క్రికెట్ స్టేడియం, స్పోర్ట్స్ కాంప్లెక్స్ గదులను సీఎం ప్రారంభించనున్నారని వెల్లడించారు. వీటికి సంబంధించిన అన్ని పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం పర్యటనా ఏర్పాట్లపై వైఎస్ మనోహర్‌రెడ్డితో చర్చించారు. జేసీ గణేష్, ఆర్డీఓ వెంకటేశులు, కమిషనర్ నరసింహారెడ్డి, తహసీల్దార్ మాధవ పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం 'అల్లూరి'



అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎస్పీ అన్బురాజన్

కడప సెవెన్‌రోడ్స్ /అర్బన్ : మన్యం వీరుడు, స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు నేటి యువతకు ఆదర్శమని కలెక్టర్ విజయరామరాజు, ఎస్పీ అన్బురాజన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో వేరువేరుగా నిర్వహించిన అల్లూరి సీతారామరాజు జయంతి వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. నేటి సమాజానికి అల్లూరి ధైర్య సాహసాలు అవసరమన్నారు.



కేజీబీవీ ప్రిన్సిపాల్‌గా ఎంపికైన అభ్యర్థికి నియామక పత్రాన్ని అందచేస్తున్న డీఈఓ, సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి

'కొలువు'దీరిన ఆనందం

- కేజీబీవీల్లో ఉద్యోగ సందడి
- 123 మందికి నియామక పత్రాలు అందజేత
- హర్షం వ్యక్తం చేసిన అభ్యర్థులు

కడప ఎడ్యుకేషన్: ఉన్నత చదువులు చదివి.. ఎన్నో ఏళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురు చూసిన అభ్యర్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చలువతో కొలువులు దొరికాయి. దీంతో వారి ఉద్యోగ కల నెరవేరడంతో ఆనందంతో మురిసిపోయారు. దీంతోపాటు కేజీబీవీల్లోని ఖాళీలు భర్తీ కావడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందనుంది. ఇక వారి జీవితాల్లో కూడా చదువుల వెలుగులు నిండనున్నాయి. వివరాల్లోకి వెళితే..

వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యకు పెద్దపీట వేసింది. ఇందులో భాగంగా కేజీబీవీలను 2019–20లో అప్‌గ్రేడ్ చేసి ఇంటర్ విద్యను ప్రవేశ పెట్టింది. అప్పటి నుంచి సంబంధింత కేజీబీవీలకు సబ్జెక్టు ఉపాధ్యాయులతోపాటు గెస్ట్ ఫ్యాకల్టీతోనే విద్యార్థులకు విద్యనందిస్తూ వచ్చారు. ప్రస్తుతం ఆ పోస్టులను ప్రభుత్వం కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించింది. 'కొలువు'దీరిన అభ్యర్థులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

123 మందికి కొలువులు...
ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 29 కేజీబీవీలలో 128 మందికిగాను 123 మందికి ఉద్యోగాలను కల్పించారు. ఇందులో 8 మంది ప్రిన్సిపాల్స్‌గా, 89 మందికి పీజీటీలుగా, 20 మందికి సీఆర్‌టీలుగా మరో 6 మందికి పీఈటీ పోస్టులను కల్పించారు. వీరికి నియామక పత్రాలను అందజేశారు.

ఉద్యోగంతోపాటు స్థానాల కేటాయింపు...
కేజీబీవీలలో ఉద్యోగాల కోసం ఇటీవల నిర్వహించిన ఇంటర్వ్యూలలో ఎంపికైన 123 మందికి మంగళవారం కడప డీఈఓ కార్యాలయంలో జీసీడీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో డీఈఓ రాఘవరెడ్డి, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి ప్రభాకర్‌రెడ్డి నియామక పత్రాలను అందచేశారు. అనంతరం వారికి స్థానాల కేటాయింపుకు సంబంధించి కౌన్సెలింగ్ నిర్వహించి వారి మెరిట్ ప్రకారం కేజీబీవీలలో స్థానాలను కల్పించారు.

కల నెరవేరింది...



ఎప్పటి నుంచో నేను ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నాను. ప్రస్తుతం నాకు కేజీబీవీలో పీజీటీ ఉద్యోగం వచ్చింది. చాలా సంతోషంగా ఉంది. విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తాను. సీఎంకు కృతజ్ఞతలు.–నీరజ, పీజీటీ, నందలూరు

ఎంతో ఆనందంగా ఉంది...



నేను చాలా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నాను. కానీ ఉద్యోగం రాలేదు. ప్రస్తుతం కేజీబీవీల్లో వేసిన నోటిఫికేషన్ ద్వారా సీఆర్‌టిగా ఉద్యోగం సాధించాను. చాలా సంతోషంగా ఉంది. – వాజిద, సీఆర్‌టీ, మైదుకూరు

సమస్యల పరిష్కార వేదిక జగనన్న సురక్ష



సచివాలయ సిబ్బందితో సర్టిఫికెట్ల వివరాలను అడిగి తెలుసుకుంటున్న జేసీ గణేష్‌కుమార్

వేముల : ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం సమస్యల పరిష్కారానికి వేదికగా నిలుస్తోందని జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని వి.కొత్తపల్లె సచివాలయంలో మంగళవారం జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11రకాల సేవలు ఎలాంటి సేవా రుసుం లేకుడా లబ్ధిదారులకు అందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అర్హులుగా ఉండి సంక్షేమ పథకాలు అందని వారు ఉంటే వారిని గుర్తించి జగనన్న సురక్ష ద్వారా అందిస్తామన్నారు. కేవలం కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్ప ఇతర సమస్యలపై ప్రజల నుంచి ఎందుకు స్పందన లేదని సిబ్బందిని ప్రశ్నించారు. ఆధార్ సర్వీసులపై కుటుంబ సభ్యుల సర్టిఫికెట్లపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ కోగటం వెంకట బయపురెడ్డి, ఆర్డీఓ వెంకటేశులు, ఎంపీపీ చల్లా గంగాదేవి, పీసీబీ డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డిలు లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాజారెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు లీలావతి, సర్పంచ్ గంగరాజు, ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, తహసీల్దార్ వెంకట సుబ్బయ్య, సచివాలయ కన్వీనర్ రవీంద్రారెడ్డి, అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ

- సీసీ టీవీ పుటేజీ ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలన
- ఐదవ అంతస్తు నుంచి సోహిత్ పడి మృతి చెందాడని నిర్ధారణ
- పాఠశాల యాజమాన్యం, సిబ్బందిపై కేసు
- జిల్లా ఎస్పీ అన్బురాజన్ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, పక్కన మైదుకూరు డీఎస్పీ, సీఐ

కడప అర్బన్ : ఖాజీపేట మండలం కొత్త నెల్లూరు గ్రామంలోని బీరం శ్రీధర్‌రెడ్డి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈనెల 1వ తేదీన మామిడిశెట్టి సోహిత్ (11)మృతి చెందిన సంఘటనపై పోలీసులు సమగ్రంగా విచారణ చేపట్టారు. ఈ సంఘటనపై మంగళవారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయం వద్ద ఉన్న 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ వివరాలను వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. పులివెందుల టౌన్ అహోబిలాపురం వీధికి చెందిన నాగరాజు, లలితల కుమారుడు మామిడిశెట్టి సోహిత్ (11) బీరం శ్రీధర్‌రెడ్డి స్కూల్‌లో జూన్ 19న ఆరవ తరగతిలో చేరాడు. ఈ విద్యార్థి ఈనెల1న తెల్లవారుజామున కడుపునొప్పిగా ఉందని చెప్పగా వెంటనే స్కూల్ యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా తెలియజేశారు. వారు వెంటనే చెన్నూరులో ఉన్న తమ సమీప బంధువులను స్కూల్ వద్దకు పంపి, వారి ద్వారా మామిడిశెట్టి సోహిత్‌ను చికిత్స కోసం చెన్నూరులోని ఆర్ఎంపీ డాక్టర్ వెంకటేష్ వద్దకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. రెండు గంటలైనా కూడా కడుపునొప్పి తగ్గకపోగా విద్యార్థి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. దీంతో చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వెళ్లగా అక్కడి వైద్యులు పరీక్షించి ఈనెల 1న ఉదయం 9:15 గంటలకు విద్యార్థి చనిపోయాడని నిర్ధారించారు. ఈ విషయమై విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఖాజీపేట పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్. 78/2023 అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మైదుకూరు రూరల్ సీఐ వై. నరేంద్ర రెడ్డి విచారణ చేపట్టారు.

సీసీ పుటేజీల ద్వారా తెలిసిన వాస్తవాలు

■ ఈనెల 2న సోహిత్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

■ జూన్ 30న రాత్రి 9:10 గంటలకు యూకేజీ పేరుతో ఉన్న కెమెరా ప్రకారం, చనిపోయిన సోహిత్ ఇతర విద్యార్థులతో కలిసి హాస్టల్ గదిలో హుషారుగా పడక ఏర్పాట్లు చేసుకున్నాడు.

■ ఈనెల 1వ తేదీన ఉదయం 5:07 గంటలకు అదే కెమెరా ప్రకారం సోహిత్ ఒంటరిగా మంచంమీద నుంచి లేచి హాస్టల్‌లో ఇతర విద్యార్థులు నిద్రిస్తుండగా బయటకు వెళ్లాడు.

■ ఉదయం 5:08 నిమిషాలకు కెమెరా 16 ప్రకారం సోహిత్ హాస్టల్ గది నుంచి వెలుపలికి వచ్చి పై అంతస్తుకు ఉన్న మెట్లను వేగంగా ఎక్కాడు.

■ 5 గంటల 8 నిమిషాల 23 సెకెండ్లకు కెమెరా 10 ప్రకారం సోహిత్ పై అంతస్తులోని ఇనుపగేట్ వద్దకు రహస్యంగా వచ్చి ఎవరూ లేరని గమనించి అదే సమయంలో గేటు తెరిచి 5వ అంతస్తులోని టెర్రస్‌పైకి వెళ్లాడు.

■ ఉదయం 5:09 గంటలకు కెమెరా 12 ప్రకారం సోహిత్ 5వ అంతస్తుకు చేరుకుని, ఆ అంతస్తు ప్రవేశ డిజిటల్ గేటు వద్ద అందుబాటులో ఉన్న కొద్దిపాటి పెద్ద రాయిని తన ఆలోచనకు ఉపయోగించుకోవడానికి ప్రయత్నించాడు. అది కుదరకపోవడంతో దానిని అక్కడే వదిలిపెట్టాడు.

■ సోహిత్ 5వ అంతస్తులోని ప్రహరీ దగ్గర ఉన్న ఒక బకెట్‌ను బోర్లించుకుని గోడ ఎక్కాడు. ఆ గోడపై కాలు, పాదాల ముద్రలు ఉన్నాయి.

■ ఉదయం 5:10 గంటలకు సోహిత్ హాస్టల్ భవనంలోని 5వ అంతస్తు గోడపై నుంచి కిందకు దూకాడు.

■ భవనం మొదటి అంతస్తు దగ్గర 'వి' ఆకారంలో ఉన్న ఇన్సులేటెడ్ విద్యుత్ తీగలపై పడి ఆరు నుంచి 8 నిమిషాల పాటు వేలాడుతూ ఉన్నాడు. తరువాత 5:18 గంటలకు హాస్టల్ ఆవరణంలో నేలపై పడిపోయాడు. ఈ దృశ్యం స్కూల్‌లో కెమెరా నంబర్.1లో రికార్డయింది.

■ కెమెరా నంబర్. 1 ప్రకారం సోహిత్ కింద పడిన తరువాత సుమారు 4 నిమిషాల పాటు అక్కడే పడుకుని ఉండిపోయాడు. ఉదయం 5:22 గంటలకు స్కూల్ సిబ్బంది రియాజ్ సోహిత్ పడి ఉండటం గమనించి, అతని వద్దకు పరుగెత్తి, ఇతర సిబ్బందితో కలిసి సోహిత్‌ను విచారించగా, తనకు కడుపునొప్పి అని తెలిపాడు. తన తండ్రి నాగరాజు ఫోన్ నెంబర్ చెప్పగా, వార్డన్ అంజి సోహిత్ తండ్రి నాగరాజుకు ఫోన్ ద్వారా విషయం తెలుపగా అతని మేనత్తను స్కూల్ వద్దకు పంపారు. ఆమె రావడంతో సోహిత్‌ను చికిత్స నిమిత్తం పంపారు. సీసీ పుటేజీల ద్వారా లభించిన సాక్ష్యాల ఆధారాంగా ఐదవ అంతస్తు నుంచి సోహిత్ కింద పడటం వల్లే మరణించాడని నిర్ధారణకు వచ్చారు. పాఠశాల యాజమాన్యం, సిబ్బందిపై జువైనల్ జస్టిస్ సెక్షన్ 75 కింద కేసు నమోదు చేసి, సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్, మైదుకూరు రూరల్ సీఐ నరేంద్రరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సంమస్యల కారణంగా భవన నిర్మాణ కార్మికుడు ఆత్మహత్యకు యత్నించిన సంఘటన మదనపల్లెలో మంగళవారం జరిగింది. మదనపల్లె పట్టణ సమీపంలోని సత్యసాయికాలనీ(ఇసుకనూతనపల్లె)కు చెందిన యు.రెడ్డి (32) భవన నిర్మాణ కార్మికుడిగా వైఎస్సార్ కాలనీలోని వేణు మేస్త్రీ వద్ద పని చేస్తున్నాడు. వారం రోజులుగా అక్కడే ఉంటున్నాడు. అయితే కుటుంబ సమస్యల కారణంగా ఉంటున్న చోటే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మెడికల్ కాలేజీకి శరీరదానం



నరసింహారెడ్డి (ఫైల్)

ప్రొద్దుటూరు క్రైం : చెన్నూరు చక్కెర ఫ్యాక్టరీ మాజీ ఉద్యోగి పూదూరు నరసింహారెడ్డి (75) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలతో పాటు మృతదేహాన్ని కడప రిమ్స్ మెడికల్ కాలేజీకి అందజేశారు. నరసింహారెడ్డి ప్రొద్దుటూరులోని గీతాశ్రమం వీధిలో 40 ఏళ్లుగా నివాసం ఉంటున్నారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె విప్లవ రచయితల సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి వరలక్ష్మి ప్రొద్దుటూరులో ఉండగా, కుమారుడు రామనాథరెడ్డి హైదరాబాద్‌లో ఉంటున్నారు. నరసింహారెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఆయన ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. సంప్రదాయం ప్రకారం కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించకుండా ఆయన మృతదేహాన్ని మెడికల్ కాలేజీకి ఇవ్వడం స్ఫూర్తిదాయకమని పలువురు కొనియాడారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్ట్



చోరీ కేసులో నిందితుడి అరెస్ట్ వివరాలను తెలియజేస్తున్న చిన్నచౌక్ సీఐ శ్రీరామ శ్రీనివాసులు

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్జీఓ కాలనీలో ఈనెల 9న వంకదారి రాణి అనే మహిళ ఇంటిలో చోరీ జరిగింది. ఈ సంఘటనలో నిందితుడిని గుర్తించిన చిన్నచౌక్ సీఐ శ్రీరామ శ్రీనివాసులు, తమ సిబ్బందితో కలిసి కడప నగరం శాస్త్రి నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ చంద్రగిరి రామకృష్ణను ఆర్టీసీ బస్టాండ్ వద్ద మంగళవారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 25 గ్రాముల బరువున్న సుమారు రూ.1.50 లక్షల విలువైన బంగారు చైను, జత కమ్మలు, చెంపసరాలను రికవరీ చేశారు. ఈ సందర్భంగా నిందితుడి అరెస్ట్ వివరాలను సీఐ వివరించారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన హెడ్‌కానిస్టేబుల్ శివకుమార్, కానిస్టేబుల్ శ్రీనివాసులు, సిబ్బందిని సీఐ అభినందించారు.

సౌమ్యనాథున్ని దర్శించుకున్న అన్నమయ్య జిల్లా ఎస్పీ

నందలూరు (రాజంపేట) : సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం జిల్లా ఎస్పీ గంగాధరరావు స్వామివారిని దర్శించుకున్నారు. ఎస్పీకి ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. టీటీడీ అర్చకస్వాములు తీర్థ ప్రసాదాలను అందచేశారు. ఆలయ విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ చైతన్య, సీఐ పుల్లయ్య ఉన్నారు.

వల్లూరు వైఎస్ఆర్ క్రాంతి పథంలో రూ.53.79 లక్షలు స్వాహా

- ఇసుక కమీషన్, స్త్రీనిధి, ఉన్నతి, సీఐఎఫ్ నిధులను స్వాహా చేసిన సీసీ
- ప్రాథమిక విచారణలో వెల్లడి
- సీసీపై సస్పెన్షన్ వేటు, పోలీసు కేసు నమోదుకు ఆదేశాలు



వల్లూరు ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న మండల సమాఖ్య ప్రతినిధులు

వల్లూరు : వల్లూరు వైఎస్ఆర్ క్రాంతి పథంలో సుమారు 53.79 లక్షల రూపాయల మేర నిధుల దుర్వినియోగం జరిగింది. 2014 నుంచి 2023 వరకు మండలంలో పని చేసి ప్రస్తుతం కమలాపురం మండలంలో పని చేస్తున్న మండల సమాఖ్య సీసీ సునీత ఆమె సొంత బ్యాంకు ఖాతాలతో బాటు బంధువుల బ్యాంకు ఖాతాలకు నిధులను మళ్లించి దుర్వినియోగం చేసినట్లు అధికారులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. మండల సమాఖ్య నిధుల దుర్వినియోగం గురించి ఈ నెల 24 వ తేదీన పత్రికల్లో వార్త ప్రచురితమైంది. దీంతో పాటు మండలానికి చెందిన వీవోఏలు జిల్లా కలెక్టర్ విజయ రామరాజు, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డిలను కలిసి నిధుల స్వాహాపై వినతి పత్రాన్ని అందచేసి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ మేరకు డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్ ముగ్గురు లీగల్ కో ఆర్డినేటర్లను దీనిపై విచారణకు నియమించారు. వారితో పాటు పీడీ స్వయంగా వల్లూరు మండల సమాఖ్య కార్యాలయానికి వచ్చి వీవోఏలతో పాటు సిబ్బందిని విచారించారు.

ఇసుక కమీషన్ నిధులు రూ.29.13 లక్షలు స్వాహా

ఇందులో స్త్రీనిధి, సీఐఎఫ్, ఉన్నతి, ఇసుక కమీషన్లకు సంబంధించి మొత్తం 53. 79 లక్షల రూపాయలు దుర్వినియోగం అయినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. తప్పెట్ల - 1, తప్పెట్ల - 2, దుగ్గాయపల్లె మెయిన్, దుగ్గాయపల్లె -2, లేబాక -1, లేబాక -2, తోల్లగంగనపల్లె గ్రామ సమాఖ్యలకు సంబంధించి స్త్రీ నిధి నిధులు రూ 3.20 లక్షలు, సీఐఎఫ్ నిధులు రూ.21. 01 లక్షలు, ఉన్నతి నిధులు రూ.0.19 లక్షలు దుర్వినియోగం అయ్యాయని గుర్తించారు. అలాగే 2014 నుండి 2017 సంవత్సరం వరకు నడిచిన తప్పెట్ల ఇసుక రీచ్‌కు సంబంధించిన కమీషన్ నిధులు రూ 29.13 లక్షలు దుర్వినియోగం అయినట్లు గుర్తించారు. కాగా మొత్తం మీద అన్నీ కలిపి రూ 53.79 లక్షల నిధులు దుర్వినియోగం కాగా సదరు సీసీ ఇప్పటికే రూ. 5.08 లక్షలను చెల్లించారు. అవి పోనూ రూ. 47.99 లక్షలు చెల్లించాల్సి ఉన్నట్లు గుర్తించారు.

సీసీ సునీతపై సస్పెన్షన్ వేటు..పోలీసు కేసు

నిధుల దుర్వినియోగానికి పాల్పడిన సీసీ సునీతను సస్పెండ్ చేయడమే కాక పోలీసు కేసు నమోదు చేయాలని డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్ జిల్లా సమాఖ్యను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా సమాఖ్య నుంచి మంగళవారం వల్లూరు మండల సమాఖ్య కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. జిల్లా సమాఖ్య ఆదేశాల మేరకు మండల సమాఖ్య మంగళవారం సమావేశం నిర్వహించి సీసీపై కేసు నమోదుకు తీర్మానించారు. ఈ మేరకు మండల సమాఖ్య అధ్యక్షురాలు గౌరీ దేవి, కార్యదర్శి ప్రమీల, కోశాధికారి సుభాషిణి, ఏపీఎం శైలజతో కలిసి వల్లూరు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ పెద్ద ఓబన్నకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులకు నివేదించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని ఎస్ఐ తెలిపారు.

40 లీటర్ల నాటుసారా స్వాధీనం, ముగ్గురి అరెస్టు



అరెస్టయిన ముగ్గురు వ్యక్తులను చూపుతున్న ఎస్ఈబీ సిబ్బంది

పులివెందుల రూరల్ : పట్టణ శివారు కదిరి రోడ్డులో ఉన్న గంగమ్మ గుడి దగ్గర సత్యసాయి జిల్లా తలుపుల మండలం ఏపీలిపల్లె గ్రామం నుంచి పట్టణానికి నాటుసారా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 40 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఈబీ సీఐ రామాంజనేయులు తెలిపారు. మంగళవారం నగరిగుట్టకు చెందిన కావేటి శ్రీరాములు, కావేటి వెంకటమ్మ, మంకా పుల్లయ్యలను అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా వారికి 14రోజుల రిమాండ్ విధించారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్, ఎస్ఐ హుస్సేన్, పోలీసు సిబ్బంది ఈశ్వరయ్య, రాజశేఖర్, గీత, బాలగంగాధర, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సంమస్యల కారణంగా భవన నిర్మాణ కార్మికుడు ఆత్మహత్యకు యత్నించిన సంఘటన మదనపల్లెలో మంగళవారం జరిగింది. మదనపల్లె పట్టణ సమీపంలోని సత్యసాయికాలనీ (ఇసుకనూతనపల్లె)కు చెందిన యు.రెడ్డి (32) భవన నిర్మాణ కార్మికుడిగా వైఎస్సార్ కాలనీలోని వేణు మేస్త్రీ వద్ద పని చేస్తున్నాడు. వారం రోజులుగా అక్కడే ఉంటున్నాడు. అయితే కుటుంబ సమస్యల కారణంగా ఉంటున్న చోటే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అండర్–19 క్రికెట్ టోర్నీలో అగ్రస్థానంలో కడప జట్టు



తలపడుతున్న కడప, అనంతపురం జట్లు



మన్ ప్రణీల్‌రెడ్డి కడప బ్యాట్స్‌మన్ 54 పరుగులు



సాయిఆర్థిత్‌రెడ్డి కడప బౌలర్ 3 వికెట్లు



మహమ్మద్ అయూబ్ కడప బౌలర్ 4 వికెట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహించిన ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–19 క్రికెట్ టోర్నమెంట్‌లో కడప జట్టు అగ్రస్థానంలో నిలిచింది. మంగళవారంతో టోర్నమెంట్ ముగియగా పాయింట్ల పట్టికలో 12 పాయింట్లతో కడప జట్టు అగ్రస్థానంలో నిలువగా, అనంతపురం 8 పాయింట్లతో రెండోస్థానంలో నిలిచింది. కాగా మంగళవారం వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ స్టేడియంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అనంతపురం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 44.2 ఓవర్లలో 158 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని వీరారెడ్డి 35 పరుగులు, లోహిత్‌సాయి కృష్ణ 34 పరుగులు చేశారు. కడప బౌలర్లు మహమ్మద్ అయూబ్ 4, సాయిఆర్థిత్‌రెడ్డి 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 44 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని ప్రణీల్‌రెడ్డి 54 పరుగులు చేశాడు. దీంతో కడప జట్టు 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

కర్నూలు జట్టు విజయం..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో కర్నూలు, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కర్నూలు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 49.5 ఓవర్లలో 210 పరుగులు చేసి ఆలౌట్ అయింది. జట్టులోని సాయిసూర్యతేజారెడ్డి 66 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్లు బ్రహ్మతేజారెడ్డి 2, రాజ్‌దీప్ 2, నవీద్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 38 ఓవర్లలో 151 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని లోహిత్ లక్ష్మీనారాయణ 42 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్ విష్ణువర్ధన్ 5 వికెట్లు తీశాడు. దీంతో కర్నూలు జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

ఘర్షణలకు పాల్పడితే బైండోవర్ కేసులు

గంగమ్మ జాతర నిర్వాహకులకు జిల్లా ఎస్పీ గంగాధర రావు హెచ్చరిక



జాతరను ప్రశాంతంగా జరుపుకోవాలని నిర్వాహకులకు సూచిస్తున్న ఎస్పీ గంగాధరరావు

రాజంపేట టౌన్ : బలిజపల్లె గంగమ్మ జాతర విషయంలో నిర్వాహకులు ఘర్షణలకు పాల్పడితే బైండోవర్ కేసులు పెడతామని జిల్లా ఎస్పీ గంగాధరరావు హెచ్చరించారు. రాజంపేట పట్టణం బలిజపల్లెలో మంగళవారం ఎస్పీ గంగమ్మజాతర నిర్వాహకులు, ప్రజలతో సమావేశమై జాతరను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆదేశించారు. ఒక్కసారి బైండోవర్ కేసు నమోదైతే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. ఎన్నికల సమయంలో అలాగే ఎప్పుడైనా శాంతిభద్రతల సమస్య తలెత్తినప్పుడు బైండోవర్ కేసులున్న వారందరిని పోలీస్ స్టేషన్‌కు పిలిపిస్తుంటారని తెలిపారు.

ఉద్యోగ, ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లాలనుకున్నా వెళ్లలేని పరిస్థితులు ఉంటాయన్నారు. అందువల్ల ఎవరు కూడా వివాదాల జోలికి వెళ్లకుండా అందరు సమష్టిగా అన్నదమ్ముల్లా కలిసి మెలసి జాతరను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. జాతర సమయంలో ఎంతటి వారైనా ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే ఉపేక్షించే ప్రసక్తి ఉండదని హెచ్చరించారు. తాను కూడా జాతరలో పాల్గొని గంగమ్మను దర్శించుకుంటానని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ వీఎన్‌కే చైతన్యకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఎస్పీ గంగమ్మకు పూజలు నిర్వహించి కొబ్బరికాయ సమర్పించి, ఎంతో విశిష్టత కలిగిన బలిజపల్లె గంగమ్మను దర్శించుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు.

ఎమ్మెల్యే చొరవతో కదిలిన పోలీస్ అధికార యంత్రాంగం

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో బలిజపల్లె గంగమ్మ జాతర రెండవ పెద్ద జాతరగా ప్రసిద్ధిగాంచింది. అయితే నిర్వాహకుల మధ్య సాంగ్యాల విషయంలో వివాదాలు తలెత్తడంతో ఈ ఏడాది ఏకంగా జాతర నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో అనేక మంది భక్తులు, ప్రజలు ఇటీవల ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిని కలిసి జాతర నిర్వహణకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందించి జూలై రెండవ వారంలోపు జాతరను ఎట్టి పరిస్థితుల్లో నిర్వహించాలని డీఎస్పీ చైతన్యను ఆదేశించారు. దీంతో డీఎస్పీ రంగంలోకి దిగి జాతర నిర్వహణకు మార్గం సుగమం చేశారు. దీంతో ఈనెల 13న గంగమ్మ జాతర నిర్వహణకు పోలీసు అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే చొరవతో జాతర జరగనుండటంతో గంగమ్మ భక్తుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

లారీ ఢీకొని వృద్ధుడు మృతి

మదనపల్లె : రోడ్డుదాటుతున్న వృద్ధుడిని లారీ ఢీకొనగా మృతి చెందిన సంఘటన మంగళవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. బర్మావీధికి చెందిన బలరామయ్య(70) ఇతరులకు బాకీ తీర్చేందుకుగాను అన్నమయ్య కూడలి వద్దకు వెళ్లాడు. తిరిగి వస్తూ రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన లారీ ఢీ కొంది. దీంతో అధిక రక్తస్రావం కావడంతో బాధితుడు అపస్మారస్థితిలోకి వెళ్లాడు. గమనించిన స్థానికులు స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతునికి భార్య బాలచంద్రిక, ముగ్గురు సంతానం ఉన్నారు.

బైకు, మినీ వ్యాన్ ఢీ

పుల్లంపేట : కడప–చెన్నై జాతీయ రహదారి పుల్లంపేట బైపాస్‌లో మంగళవారం బైకు, మినీ వ్యాన్ ఢీకొన్నాయి. ఈ సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. బాషావాండ్లపల్లికి చెందిన పుల్లయ్య, అన్నయ్య అనే వ్యక్తులు ద్విచక్రవాహనంలో పుల్లంపేటకు వచ్చారు. ఈ క్రమంలో పుల్లంపేట బైపాస్ సమీపంలో రోడ్డు దాటుతుండగా మినీ వ్యాన్ ఢీ కొంది. దీంతో ద్విచక్రవాహనంపై వెళుతున్న ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.